క్లుప్తంగా

కేసీఆర్ వ్యాఖ్యలు గర్హనీయం

ఖమ్మంవన్‌టౌన్: నల్లగొండ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. రెండు నెలల తర్వాత ప్రజల ముందుకొచ్చిన కేసీఆర్ నిజాలు మాట్లాడతారని అంతా భావించారని తెలిపారు. కానీ ఆయన సహజ పద్ధతిలోనే అబద్ధాలు మాత్రమే మాట్లాడారని మండిపడ్డారు. కృష్ణా జలాలపై వ్యాఖ్యలు చేసిన కేసీఆర్ అసెంబ్లీలో జరిగిన చర్చకు ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీళ్ల విషయంలో దోపిడీ, నియామకాల్లో ఆలసత్వం, అవినీతికి పాల్పడి అందినకాడికి దోచుకున్నారని విమర్శించారు. అంతేకాక ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా ఓటర్ల విజ్ఞతను శంకించారని మంత్రులు తెలిపారు.

నల్లగొండకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

కామేపల్లి: చలో నల్లగొండ బహిరంగ సభకు మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ఆంతోటి అచ్చయ్య, సామా మోహన్‌రెడ్డి, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, పుచ్చకాయల బాబు, బానోత్ రాందాస్‌నాయక్ తదితరులు తరలివెళ్లారు.

ఆధార్‌లో మార్పుల పేరిట వసూళ్లు

తిరుమలాయపాలెం: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కోసం ఆధార్ కార్డులో మార్పులు చేయించుకునేందుకు ప్రజలు పడుతున్న ఆరాటాన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. కొద్ది రోజులుగా మండలంలోని కొక్కిరేణి అంగన్‌వాడీ కేంద్రంలో ఓ వ్యక్తి ఆధార్ మార్పులు చేస్తానని చెబుతూ డబ్బులు దండుకున్నాడు. ఈ విషయమై గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, డీటీ నర్సింహారావును వివరణ కోరగా ప్రభుత్వం నుంచిఆధార్‌లో రాష్ట్రం పేరు మార్పు కోసం ఎవరినీ నియమించలేదని, ఘటనపై విచారణ చేపడుతామని తెలిపారు. అలాగే, తహసీల్దార్ రాంప్రసాద్ మాట్లాడుతూ అధీకృత కేంద్రాల్లోనే మార్పులు చేస్తారని తెలిపారు.

జలాభిషేకం

కామేపల్లి : మండలంలోని తాళ్లగూడెంలో బుధవారం తిరుపతమ్మ నగర సంకీర్తన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి మహిళలు జలబిందెలతో తరలివచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. గ్రామ పురవీధుల్లో తిరుపతమ్మ దీక్షాస్వాములు మేళతాళాలతో నృత్యాలు చేస్తూ జలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణీకి గాయాలు

కామేపల్లి: మండలంలోని మద్రిగూడెం స్టేజీ సమీపాన మంగళవారం ఖమ్మం వైపు వెళ్తున్న ఆటోను వెనక నుంచి ట్రాలీ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న సింగరేణి మండలం కొత్తతండాకు చెందిన నిండు గర్భిణీ అజ్మీరా లలితకు గాయాలుకాగా 108లో ఖమ్మం తరలించారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: సఖి జాతీయ మహిళా మండలి నేషనల్ కో కన్వీనర్‌గా దండమూడి గిరిజ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సఖి జాతీయ మహిళా మండలి నేషనల్ కోకన్వీనర్, ఫౌండర్ ఎస్.సత్యనారాయణ నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..నిరుపేద మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈనేపథ్యాన 27వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డ నగేశ్‌తో పాటు పలువురు ఆమెను అభినందించారు.

టీఈజీఏ జిల్లా అధ్యక్షుడిగా శ్రీను..

కామేపల్లి: తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా బాదావత్ శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లాలోని బంజారా భవన్‌లో రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు గంగావత్ శ్రీనివాస్‌నాయక్ నియామక పత్రాన్ని శ్రీనుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో రామచంద్రునాయక్, సారంగపాని, గుగులోత్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 13 మంది విద్యార్థులు ఎంపిక

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో మంగళవారం వీటీఎస్ కంపెనీ నిర్వహించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగాలకు 13 మంది ఎంపికైనట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ నియామకాలలో 185 మంది విద్యార్థులు హాజరు కాగా 13 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీజీటీగా ఎంపిక

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంపల్లికి చెందిన తుమ్మ వెంకటేశ్వర్లు–మంగమ్మ దంపతుల రెండో కుమారుడు శేఖర్ సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో గురుకుల పాఠశాలలో పీజీటీ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడుగా ఉద్యోగం సాధించారు. తల్లిదండ్రులు నిరుపేదలు అయినప్పటికీ వ్యవసాయ కూలీ పనులు చేసి చదివించిన వారి కష్టాన్ని వృథా కానివ్వలేదని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు.





గాజు, ప్లాస్టిక్, రేడియం, స్టోన్ పౌడర్, ఫైబర్‌లతో తయారు చేసిన బహుమతులు



తాజ్‌మహల్



ఆకట్టుకుంటున్న బహుమతి

ప్రేమను పంచేవేళా..



గిఫ్ట్ ఆర్టికల్ షాపులో టెడ్డీ బేర్స్ తదితర వాటిని చూపుతున్న విక్రయదారులు

- ప్రేమకు గుర్తుగా బహుమతులు
- రేడియం స్టోన్స్, ఫైబర్, ప్లాస్టిక్, గాజులతో వస్తువుల తయారీ
- రూ.వంద నుంచి రూ.వేలల్లో ధర పలుకుతున్న వైనం
- మార్కెట్‌లో గిఫ్ట్‌లకు ఫుల్ డిమాండ్
- వాలంటైన్స్ డేకు గుర్తుగా కొంటున్న ప్రేమికులు

నేడు ప్రేమికుల దినోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: బంధాలు, అనుబంధాలు, ప్రేమానురాగాలతో మిళితమై ఉన్న ఈ సమాజంలో ప్రేమను వ్యక్త పరచడానికి ఎన్నో మార్గాలుంటాయి. అందులో ఒక మార్గమే బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం. మదర్స్ డే, ఫాదర్స్ డే, ఉమెన్స్ డే.. ఇలా ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకతను తెలియజేస్తుండగా.. ప్రేమికుల కోసం ఫిబ్రవరి 14వ తేదీన ప్రేమికుల దినోత్సవంగా జరుపుకుంటారు. ప్రేమను వ్యక్తపరచడానికి బహుమతులే మంచి మార్గం కావడంతో మార్కెట్‌లో గిఫ్ట్‌లకు వన్నె తగ్గడం లేదు.

ప్రేమ..
ఇవి రెండు అక్షరాలే అయినా వీటి గురించి చెప్పమంటే మాత్రం ప్రేమికుల దగ్గర అస్సలు మాటలుండవు. మాటల్లో చెప్పలేని అనుభూతి ప్రేమ అని ఓ క్యాప్షన్ ఇచ్చి నవ్వేస్తారు. అలాంటి ప్రేమను ప్రపంచవ్యాప్తంగా ప్రేమికులు సెలబ్రేట్ చేసుకునేందుకు 'ప్రేమికుల దినోత్సవం' రానేవచ్చింది. ఫిబ్రవరి 14వ తేదీన జరుపుకునే ఈరోజున ప్రేమికులు తమ మనసుకు మెచ్చిన వారికి, భాగస్వామికి ఎంత ఖరీదు బహుమతి ఇవ్వడానికైనా వెనుకాడరు. ఈ నేపథ్యాన బహుమతులు, గ్రీటింగ్ కార్డులు, ఫ్లవర్స్ ఇస్తూ తమ ప్రేమను వ్యక్తపరుస్తుంటారు.

అభిరుచులకు అనుగుణంగా..



ప్రేమికుల అభిరుచులకు తగిన విధంగా గిఫ్ట్ ఆర్టికల్స్ అందుబాటులో ఉన్నాయి. ప్రేమికులు, దంపతులు బహుమతులను కొనుగోళ్లు చేస్తున్నారు. గతంలో ప్రేమికులు తమ ప్రేమను వివిధ రకాల కొటేషన్లు, సింబల్స్‌తో ఉన్న కార్డులను ఇచ్చేవారు. ప్రస్తుతం ఫోన్లలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో వాట్సాప్‌లలో తమ మనసులోని ప్రేమ, భావాలను చెప్పుకుంటున్నారు.

– ఎస్.వెంకట్,
సాయిశ్రీ గిఫ్ట్ ఆర్టికల్స్, కమాన్‌బజార్, ఖమ్మం

భిన్నమైన రకాలు..

ప్రేమకు గుర్తుగా భిన్నమైన బహుమతులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. గిఫ్ట్ ఆర్టికల్ దుకాణంలో రేడియం స్టోన్స్, ఫైబర్, గ్లాస్, ప్లాస్టిక్ వంటి వాటితో పాటు టెడ్డీ బేర్స్‌తో ఉన్న బహుమతుల విక్రయాలు సాగుతున్నాయి. విద్యార్థులు, యువత మొదలు పెద్దల వరకు కూడా తమ అభిరుచులు, సంప్రదాయాలకు అనుగుణంగా బహుమతులను కొంటున్నారు.

రూ. వందల నుంచి రూ.వేలల్లో..

ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్కెట్‌లో వివిధ రకాల మోడల్స్ విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్ లైట్లతో అమర్చిన బహుమతులు, రేడియం స్టోన్స్, స్టోన్ పౌడర్, లవ్ సింబల్స్, కీ చైన్స్, టెడ్డీ బేర్స్ వంటి వాటిని మార్కెట్‌లో లభిస్తుండగా.. వాటి సైజ్, ఆకారాన్ని బట్టి రూ. వందల నుంచి రూ. వేల వరకు పలుకుతున్నాయి.

'గృహజ్యోతి'కి ఆన్‌లైన్ చేసుకోవాలి

తిరుమలాయపాలెం/కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా ప్రవేశ పెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం ప్రజలు ఆన్‌లైన్ చేసుకోవాలని తిరుమలాయపాలెం విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్, కామేపల్లి విద్యుత్ శాఖ ఏడీ ఆనంద్ కుమార్‌లు తెలిపారు. ఆయా మండలాల్లోని విద్యుత్‌శాఖ సిబ్బంది చేపట్టిన ఆన్‌లైన్ కార్యక్రమాన్ని వారు పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. గ్రామాల్లోకి వచ్చే తమ సిబ్బందికి ఆధార్, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లుతో వెళ్లి తమ వివరాలను నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏఈ శ్రీనివాసులు, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ సరోజ, సీనియర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కామేపల్లి: పండితాపురంలో వివరాలు సేకరిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు

16న బంద్‌ను జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: మోదీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరిగే పారిశ్రామిక గ్రామీణ సడక్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యాన మంగళవారం నగరంలో విస్తృత ప్రచారం చేశారు. మయూరిసెంటర్ నుంచి ఇల్లెందుక్రాస్ రోడ్డు వరకు ప్రచార కరపత్రాలను అందించి బంద్ ఆవశ్యకతను వివరించారు. గాంధీచౌక్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు.. బాగం హేమంతరావు మాట్లాడుతూ మోదీ ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్నారన్నారు. మరోసారి మోదీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకమవుతుందని తెలిపారు. రైతాంగ పోరాట ఫలితంగా తాత్కాలికంగా వాయిదా వేసినప్పటికీ మళ్లీ అధికారంలోకొస్తే వాటిని అమలు చేసి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, యర్రా శ్రీకాంత్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు వై.విక్రమ్, శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, ఆవుల అశోక్, జి.రామయ్య, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచిలో బైక్‌ర్యాలీలో పాల్గొన్న నాయకులు

కార్మిక సంఘాల ఆధ్వర్యాన..

నేలకొండపల్లి/కూసుమంచి/ తిరుమలాయపాలెం : ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల నాయకులు పలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నేలకొండపల్లిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేశ్ మాట్లాడగా.. కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో బైక్ ర్యాలీ నిర్వహించి సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కేవీ.రెడ్డి, ఏటుకూరి రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, దుగ్గి వెంకటేశ్వర్లు, చింతలపాటి భాస్కర్, పగిడికత్తుల నాగేశ్వరరావు, బజ్జూరి వెంకట్రామిరెడ్డి, ఐ.వెంకన్న, గుండెపొంగు మల్లేష్, శివలింగం, గొర్రెపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం ఎంపీడీఓగా మహబూబాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన కె.శేషాద్రి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన చుంచు శ్రీనివాసరావు ఏపీడీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో శేషాద్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

కామేపల్లి: కామేపల్లి ఎంపీడీఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి బదిలీపై భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీ కాగా మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. అదే విధంగా కామేపల్లి ఎంపీడీఓగా రవీందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి, జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్, సంఘ కోశాధికారి ధరావత్ మాన్‌సింగ్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కామంచికల్ హైస్కూల్‌లో ఘర్షణ



గ్రామస్తులకు పట్టుపడిన యువకుడు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ హైస్కూల్‌లో కొంతమంది యువకులు ఘర్షణ పడ్డారు. మంగళవారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బయటి ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు హైస్కూల్‌లోకి చొరబడి విద్యార్థులతో గొడవపడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘర్షణ పడ్డ యువకులను పట్టుకునే ప్రయత్నం చేయగా అందులో ఓ యువకుడు పట్టుబడ్డాడు. అనంతరం పోలీసులకు ఆ యువకుడిని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా ఆ యువకుడు గంజాయి మత్తులో ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, దీనిపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని పీడీఎస్‌యూ జాతీయ నేత ఎస్.నాగేశ్వరరావు(ఓయూ రీసెర్చ్ స్కాలర్), జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యాన కాకతీయ యూనివర్శిటీ సబ్ క్యాంపస్‌లో నిర్వహించిన సెమినార్‌లో వారు మాట్లాడారు. ఉండాల్సిన అర్హతలన్నీ జిల్లాకు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసి ఖమ్మం జిల్లాలో మాత్రం ఏర్పాటు చేయకపోవడం వెనుక జిల్లాలోని ప్రజా ప్రతినిధుల రాజకీయ అలసత్వమే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు లక్ష్మణ్, కరుణ్, వినయ్, సురేష్, ప్రసాద్, సందీప్, శ్రీను, లాల్‌పాషా, రాకేష్, భరత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

'ఆర్జేసీ'లో అవగాహన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఆర్జేసీ డిగ్రీ కళాశాలలో తమిళనాడుకు చెందిన ఐసీటీ అకాడమీ ఆధ్వర్యాన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు భాష మీద పట్టు సాధిస్తే ఇంటర్వ్యూలలో విజయం సాధించడం సులభమవుతుందన్నారు. అనంతరం ఐసీటీ అకాడమీ ట్రైనర్, హెచ్‌ఆర్ బోధి సత్వ పలు అంశాలపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య, ఇన్‌చార్జ్ వెంకటరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగు లాభదాయకం



డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులు ఎం.విజయనిర్మల, జి.అనసూయ తెలిపారు. ఖమ్మం బల్లేపల్లిలో రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు క్షేత్రంలో డ్రాగన్ ఫ్రూట్ మొక్కల నాటే కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించి మాట్లాడారు. రైతులు నూతన పంటల సాగుకు ముందుకు రావాలని సూచించారు. సూక్ష్మసేద్యం ప్రాజెక్టు డైరెక్టర్ రమణ, ఏడీఏ ఎ.శ్రీనివాసరావు, ఏఓ బి.కిషోర్ బాబు, ఉద్యాన అధికారి వేణు, ఏఈఓ షిరణ్మయి, రైతు ఏపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

18న 'నెలనెలా వెన్నెల'

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు 79వ నెల నెలా వెన్నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఎ.సుబ్రమణ్యకుమార్‌లు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నాటికలు, నృత్యాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని, ఖమ్మం కళాపరిషత్, ప్రజా నాట్య మండలి సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి కళాభిమానులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పెండింగ్ డీఆర్‌లు చెల్లించాలి

ఖమ్మంమయూరిసెంటర్: పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు కోరారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ కమిషన్ రిపోర్ట్ తెప్పించి 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని,20 ఏళ్ల సర్వీస్ కలిగిన వారికి పూర్తి పెన్షన్ ఇవ్వాలని, పన్నెండేళ్లకే సీపీపీ రీస్టోర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోపీచంద్, రాజేంద్రప్రసాద్, కె.శ్రీధర్, పి.కృష్ణారావు, కొమ్మాలు వెంకటయ్య, పి.చంద్రశేఖర్, పి.వెంకన్న, సాహెబ్, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 18న ఖమ్మం సెయింట్ మెరీస్ పాఠశాల ఆవరణలో నిర్వహించే మదర్సా రుఖయ్య బనాత్ రెండో వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని మదర్సా కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఇమామ్ ఎ ఖతిబ్, మస్జిదే అస్తబుల్ ముఫ్తీ అబ్దుల్ ఖాలిక్ సహెబ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఈ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. జమియతే ఎ ఉలేమా హింద్ జిల్లా అధ్యక్షుడు మౌలానా సయీద్ అహ్మద్ ఖాస్మీ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరగనుండగా.. తమ మదర్సాకు చెందిన పదిమంది అమ్మాయిలు ఆలిమ్ కోర్సు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఫ్తీ అబ్దుల్ ఇబ్రాయిల్, కలాం, మౌలానా సర్వర్, నిజామ్ గౌస్, నయ్యర్, ఖలీల్, హసన్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా మహా సభల పోస్టర్లు..

రఘునాథపాలెం:మండలంలోని వేపకుంట్ల గ్రామంలో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ యూనిటీ మహాసభలు విజయవంతం కోరుతూ ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో జరిగే ఈ సభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవుల మగతాయి, ఝాన్సీరాణి, మండలం కార్యదర్శి లక్ష్మణ్, బాలిన నర్సింహారావు, నరసయ్య, రామనాథం, బాబు, కృష్ణ, బాలిన వెంకటేశ్వర్లు, మేక పిచ్చయ్య, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీజీవోస్ సభ్యత్వాలు అందజేత

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజీవోస్) సభ్యత్వాలను వేగవంతం చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రిలు తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లోని వివిధ శాఖల అధికారులు, గెజిటెడ్ ఉద్యోగులకు సభ్యత్వాలను అందించిన సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా ఖజానా శాఖ కార్యాలయం, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, జిలాల ఉపాధి కల్పనాధికారి కార్యాలయం, విద్యాశాఖ, మైన్స్ అండ్ జియాలజీ, హార్టికల్చర్, సెరికల్చర్, మెడికల్ అండ్ హెల్త్, ఇండస్ట్రీస్ తదితర శాఖల్లో పని చేస్తున్న గెజిటెడ్ అధికారులకు సభ్యత్వాలు అందించామన్నారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీఓస్ నాయకులు కొణిదెల శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీనివాసరావు, కొమరగిరి దుర్గాప్రసాద్, రవీంద్రబాబు, నగేశ్, వినయ్, సౌజన్య, నూర్జహాన్ బేగం, రేష్మ, మాధవి, కత్తుల రవిలు మద్దతు తెలపగా.. శేషు ప్రసాద్, వాసిరెడ్డి శ్రీనివాస్, కృష్ణారావు, నయీమ్ పాషా, మంజుల, తమ్మిశెట్టి శ్రీనివాస్, మోదుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



రఘునాథపాలెం: కామంచికల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కామేపల్లి/రఘునాథపాలెం/కూసుమంచి/ఖమ్మంసహకారనగర్: ఆయా మండలాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఖమ్మం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం మండలాల స్థాయి ప్రతిభా పాఠవ పరీక్ష నిర్వహించారు. కామేపల్లి, కూసుమంచి హైస్కూల్‌లలో, రఘునాథపాలెం మండలం కామంచికల్ ఉన్నత పాఠశాల, ఖమ్మం నగరంలోని రిక్కాబజార్‌లో టాలెంట్ టెస్ట్ నిర్వహించగా.. మండలాల నుంచి పలువురు విద్యార్థులు హాజరయ్యారు. కామేపల్లిలో నిర్వహించిన పరీక్షలో మద్దులపల్లి విద్యార్థి పి.వేణు(ప్రథమ),ఎస్‌కె.అబ్దుల్(తృతీయ), కొమ్మినేపల్లి విద్యార్థి కె.నవీన్‌కుమార్ (ద్వితీయ) స్థానంలో నిలిచారు. అలాగే రఘునాథపాలెంలో కామంచికల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. వివేకానంద(ప్రథమ), బి. పవన్‌కుమార్(తృతీయ), చిమ్మపుడి పాఠశాలకు చెందిన ఆర్.సింధు ద్వితీయ స్థానాల్లో నిలిచారు.అదేవిధంగా కూసుమంచిలో పాసిని శ్రీజ (ప్రథమ), తంగెళ్ల మహాలక్ష్మి (ద్వితీయ), నిత్యశ్రీ (తృతీయ) స్థానాలు సాధించారు. ఒక్కో మండలం నుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపికచేసి ఈ నెల 18న రిక్కాబజార్ హైస్కూల్‌లో జరిగే జిల్లా స్థాయి టాలెంట్ టెస్టుకు హాజరుకానున్నారు. ఎంఈఓ బీవీ రామాచారి, హెచ్‌ఎంలు ఎం.వెంకటేశ్వరరావు, ఆర్.కరుణకుమారి, శైలా, వీరస్వామిలతో పాటు పి. హేమలత, శారద,కృపాబాలనందం,సుజాత,తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై నిరసన

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామ పంచాయతీలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. గ్రామంలో నెల రోజులుగా నీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎంపీడీఓ రామకృష్ణ దృష్టికి తీసుకురాగా సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వగా వారు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో రేమళ్ల రమేష్‌బాబు, రామారావు, రెంటాల దానయ్య, గునగంటి రామారావు, బానోత్ వెంకన్న, దార శ్రీకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.